# మంత్రి పదవి

ఇందుపురంలో సగుణసేతు మహారాజు రాజ్యం చేస్తూ ఉండేవాడు. తండ్రిలాగే ప్రజారంజకంగా పాలిస్తూ ప్రజల ప్రేమనీ, అనురాగాన్నీ చూరగొన్నాడు. మహారాజు కొలువు తీరి ఉండగా, పేదబ్రాహ్మణుడు వచ్చి మహారాజుకి ఒక పత్రం అందించాడు. అందులో మూడు నీతులు ఉన్నాయి. సగుణసేతుడు బ్రాహ్మణుని ఏం కావాలో కోరుకో మన్నాడు. బ్రాహ్మణుడు తన కూతురిపెళ్లి చేసుకోవాలని, ఒక్కొక్క నీతికి వెయ్యి వరహాలు ఇమ్మని కోరాడు. సగుణసేతుడు మూడు వేల వరహా లిచ్చి బ్రాహ్మణుని ఆశీస్సులు పొందాడు. ఆ నీతులని పట్టువస్త్రంమీద సువర్ణాక్షరాలతో చెక్కించి, శయన మందిరంలో తన పడకకి ఎదురుగా ప్రేలాడదీశాడు.

ఆ రాత్రి పడుకుంటూ మొదటి నీతి సూత్రం చదివాడు. "ఎప్పుడూ మెలకువతో ఉండు" అని ఉంది. తొందరగా మారువేషం వేసుకొని, తన ప్రజలు కష్టపడుతున్నారేమో చూడటానికి బయలుదేరాడు. ఆ అర్ధరాత్రి తిరుగుతూ ఉంటే ముసలికంఠం బాధతో ఏడవటం వినబడింది. "నీ కొచ్చిన కష్టం ఏమిటమ్మా?" అని ఆమెని అడిగాడు, మారువేషంలో ఉన్న సగుణసేతుడు. ముసలామె, అతనిని గుర్తుపట్టలేక "నువ్వు ఆరుస్తావా, తీరుస్తావా? నీ వల్ల ఏమీ జరగదు. పో" అంది. చెప్పాలని పట్టుబట్టాడు సగుణసేతుడు. ఆ ముసలావిడ, "ప్రజల్ని తండ్రిలా కాపాడే మహారాజుకి ఆపద వచ్చి పడింది. వారం రోజుల నాటికి మా మహారాజు పాముకాటుకి చచ్చిపోతాడు" అని ఏడ్చింది. సగుణసేతుడు, బ్రాహ్మణుని సూక్తివలన రాగల అపాయము ముందుగా తెలిసింది కదా అని సంతోషించాడు.

సగుణసేతుడు అంతఃపురం చేరుకొని రెండో సూక్తి చూశాడు. "నీ శత్రువునైనా అమితంగా ఆదరించు" అని ఉంది. కోటగుమ్మంనుండి, శయన మందిరం వరకు రకాల సుగంధపుష్పాలు, ఆకులు మత్తెక్కించే అత్తరులు ఒక పక్క విరజిమ్మారు. మరొక పక్క రుచికరమైన పదార్థాలు, పాలు, బంగారు కలువల నిండుగా తేనె, తీపి వస్తువులు, ఘుమఘుమలాడే పన్నబియ్యం అమర్చారు. సగుణసేతుడి వాకిట కోర్లచుట్టూ కుప్పలుగా ఉప్పు పోయించాడు.

ఏడవ రోజున పాము వచ్చింది. సెంటువాసనలకి మత్తెక్కి, ఒక్కొక్క పువ్వునే వాసన చూస్తూ, తినుబండారాలు మేస్తూ శయన మందిరం చేరింది. మహారాజు నిద్రపోతున్నాడు. పొట్టనిండా తేనెబియ్యం ఎక్కిందేమో, ఈ రుచికి ఉప్పుకూడా తింటే బావుంటుందని ఉప్పు రుచి చూసింది. మంచంకోళ్ల మీంచి పాకి సగుణసేతుని కాటు వేయబోయింది. హఠాత్తుగా పాముకి, 'ఈ మహారాజు ఉప్పు తిన్నాం, కాటు వేయటం చాలా అధర్మం' అని తట్టింది. కాటు వేయకుండా వచ్చినదారినే పాకి వెళ్లిపోయింది. సగుణసేతుడి ప్రాణం బ్రాహ్మణుడి రెండవ నీతి సూత్రంవల్ల రక్షింపబడింది.



పులకించిన శిల

—ఫోటో: పి. ఏ. వివేకానందన్ (మద్రాసు-౩)

సగుణసేతుడికి దుష్టబుద్ధిగల మంత్రి ఉండేవాడు. మహారాజుని చంపి, తనెలాగైనా సింహాసనం ఆక్రమించాలని ఆ మంత్రి అవకాశం కోసం చూస్తున్నాడు. మహారాజుకి జబ్బు చేసింది. రాజవైద్యుడి ద్వారా మహారాజుకి విషం ఇవ్వాలని మంత్రి పన్నాగం. కొన్ని వేల వరహా లిచ్చి రాజవైద్యుణ్ణి లోబరుచుకొన్నాడు. రాజవైద్యుడు మందంటూ సగుణసేతుడి దగ్గిరికి వెళ్లాడు. చేతిలో ఉన్నది విషం. సగుణసేతుడు మందు అందుకోవడానికి లేచాడు. ఎదురుగా మూడవ నీతిసూత్రం హెచ్చరించింది—"ఏ పని చేసేముందరైనా బాగా ఆలోచించు" అని. సగుణసేతుడు రాజవైద్యుడి మొహంలోకి చూశాడు. రాజవైద్యుడు తనని మహారాజు అనుమానిస్తున్నాడేమో అనుకొన్నాడు. చేతులు వణికాయి. రాజవైద్యుడు మహారాజు కాళ్ల మీద పడి, దుష్టుడైన మంత్రి పన్నాగం అంతా చెప్పేసి తనకి శిక్ష విధించమన్నాడు. సగుణసేతుడు మంత్రిచేతే ఆ విషమంతా తాగించాడు. మంత్రి మరణించాడు. నీతిసూక్తులవల్ల తన ప్రాణాలు కాపాడినందుకు సగుణసేతుడు పేదబ్రాహ్మణుని పిలిపించి తన మంత్రిగా చేసుకొన్నాడు. వారిద్దరూ ఎన్నో సంవత్సరాలు రాజ్యాన్ని సుభిక్షంగా పరిపాలించారు.

—పన్నాల సుబ్రహ్మణ్య భట్టు